క్లుప్తంగా

ఊపందుకున్న చెరువు తవ్వకం పనులు


రామన్నపాలెంలో చెరువు తవ్వుతున్న కూలీలు

మొగల్తూరు: మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన చెరువు తవ్వకం పనులు ఊపందుకున్నాయి. ఉపాధి హామీ పనుల్లో భాగంగా చేపట్టిన అమృత్ సరోవర్ ప కంలో రూ.3.12 లక్షలతో ఉప్పు చెరువు తవ్వకం చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ అమృత్ సరోవర్ పథకంలో చెరువును తవ్వడంతో పాటు గట్లు వెంబడి ఉన్న పిచ్చి మొక్కలను తొలగించడంతోపాటు స్థానికులకు వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.

ఆర్‌బీకేల్లో ఈ క్రాప్ ముసాయిదా వివరాలు

పోడూరు: మండలంలోని అన్ని రైతుభరోసా కేంద్రాల్లో 2022–23 రబీ సీజన్‌కు సంబంధించిన ఈ క్రాప్ ముసాయిదా వివరాలను రైతులకు అందుబాటులో ఉంచామని మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో ఈ నెల 17 వరకు ముసాయిదా వివరాల జాబితా అందుబాటులో ఉంటుందనీ, రైతులకు అభ్యంతరాలు ఉన్నా, సవరణలు ఉన్నా గ్రామ వ్యవసాయ సహాయకులకు రాతపూర్వకంగా తెలియపర్చాలని వ్యవసాయాధికారి సూచించారు. మండలవ్యాప్తంగా 6791 మంది రైతులకు సంబంధించి 13,530 ఎకరాల్లో ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.

అట్రాసిటీ కేసు నమోదు

ఉండి: మండలంలోని చెరుకువాడ గ్రామంలో కొందరిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం ఆకివీడు మండలం ఐ.భీమవరానికి చెందిన కనుమూరి వెంకట సూర్యనారాయణరాజు అనే రైతుకు చెరుకువాడలో సుమారు 7 ఎకరాల చేపల చెరువు ఉంది. దీనిని వెంప గ్రామానికి చెందిన కలిదిండి రామచంద్రరాజుకు లీజుకు ఇచ్చారు. లీజుకు తీసుకున్న రైతు చెరుకువాడ గ్రామానికి చెందిన బలం సుబ్బారావు, బలం ఆశీర్వాదం, ముస్కోడి ఏసు అనే ముగ్గురు వ్యక్తులను చెరువుపై కాపలాదారులుగా నియమించుకున్నారు. చెరువు యజమానికి, లీజుదారునికి గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో చెరువు యజమాని మరో ఐదుగురితో కలసి ఈ నెల 11వ తేదీ నుంచి 13వ తేదీల మధ్య కాపాలాదారులుగా ఉన్న ముగ్గురు వ్యక్తులను చెరువు వద్ద నుండి వెళ్లిపోవాలని బెదిరించారు. వారు వెళ్లకపోవడంతో చెరువు యజమాని మిగిలిన ఐదుగురు వ్యక్తులు కాపలాదారులను కులం పేరుతో దూషించి కొట్టారని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇన్‌చార్జి ఎస్సై ఏజీఎస్ మూర్తి కేసు నమోదు చేయగా డీఎస్పీ దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు

ఉండి : బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనకు సంబంధించి పోలీసులు ఒక వ్యక్తిపై కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారానికి చెందిన వివాహితుడు చించర్లపూడి వెంకటేష్ అనే వ్యక్తి వరుసకు సోదరి అయిన 15 ఏళ్ల బాలికపై సోమవారం రాత్రి అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపారు.

నేడు గూడెంలో శిలువ ప్రభావ వెల్లువ

పెంటపాడు: క్రీస్తు శ్రమదినాలు పురస్కరించుకొని ప్రత్యేకంగా బైబిలు మిషన్ ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో ఈనెల 15న క్రీస్తు శిలువ ప్రభావ వెల్లువ కార్యక్రమం గూడెం పోలీస్ ఐలండ్ సెంటర్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు బైబిల్ మిషన్ గవర్నింగ్ బాడీ సభ్యుడు పి. ప్రవీణ్ ఒనేసిం మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయంత్రం 6 గంటల నుంచి నిర్వహించబోయే ఈ సమావేశానికి గుంటూరుకు చెందిన డాక్టర్ జె. శామ్యేల్‌కిరణ్‌తో పాటు, మిషన్ ఉన్నతాధికారులు, పాలకవర్గసభ్యులు హాజరవుతారన్నారు. పరిసర గ్రామాల విశ్వాసులు పాల్గొనాలని ఈ సందర్భంగా ప్రవీణ్ ఒనేసిం కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఎం. డేవిడ్‌పాల్, పి. ఏసుదానం, బి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో యాగం

భీమవరం(ప్రకాశం చౌక్) : పట్టణంలోని హౌసింగ్ బోర్డులో వేంచేసియున్న శ్రీపద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి మందిరంలో నిర్వహిస్తున్న శ్రీవారి అష్టబంధన సంప్రోక్షణ మహోత్సవ యాగం వేదోక్తంగా ప్రారంభమయ్యింది. అర్చకులు పాణింగిపల్లి శ్రీనివాసాచార్యుల పర్యవేక్షణలో యావని రామచంద్ర సోమయాజి ఘనాపాటి వేదోక్త మంగళాశాసనంతో వైభవంగా నిర్వహించారు. మంగళవారం దీక్షాధారణ, అగ్ని ప్రతిష్ట, సాయంత్రం సకల హోమాలు నిర్వహించారు. కొత్తపల్లి కోదండరామ గాంధీరాజు – హైమావతి దంపతులు పీటలపై కూర్చుని పూజాధికాలు చేశారు. 20 మంది అర్చకులకు దీక్షాధారణ, ఆలయ అధ్యక్షుడు కంతేటి వెంకట్రాజు దీక్షా వస్త్రాలు అందించారు. ఉదయం 4 గంటలకు, మధ్యాహ్నం 3 గంటలకు లోకశాంతి కోసం ఈ యాగం నిర్వహించారు.

చురుగ్గా ఓపెన్ ఆడిటోరియం అభివృద్ధి పనులు

- మున్సిపాలిటీకీ పెరగనున్న ఆదాయం
- మధ్య తరగతి వారికి అందుబాటులోకి కల్యాణ మండపం


చురుగ్గా సాగుతున్న ఓపెన్ ఆడిటోరియం అభివృద్ధి పనులు

నరసాపురం: మున్సిపల్ కార్యాలయం పక్కన విలువైన స్థలంలో నిరుపయోగంగా ఉన్న మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను పడగొట్టి, అక్కడ అధునాతన వసతులతో ఓపెన్ ఆడిటోరియం కట్టే పనులు చురుగ్గా సాగుతున్నాయి. రూ.3.50 కోట్లతో చేపట్టిన పనులు వేగంగా చేస్తున్నారు. 6 నెలల్లో ఆడిటోరియం అందుబాటులోకి తెచ్చేలా పనులు సాగిస్తున్నారు. మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్ ఉండడానికి భారీ విస్తీర్ణంలో విలువైన ప్రాంతంలో ఉంది కానీ ఏమాత్రం ఉపయోగం లేకుండా పోయింది. పైపెచ్చు థియేటర్ నిర్వహణ మునిసిపాలిటీకి భారంగా కూడా మారింది. ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు కృషితో మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్ స్థానంలో రూ 3.50 కోట్లతో మున్సిపల్ ఓపెన్ ఆడిటోరియం పనులు 5 నెలల క్రితం చేపట్టారు.

నిరుపయోగంగా ఓపెన్ ఎయిర్ థియేటర్

1991లో అప్పటిలో అప్పటిలోనే రూ.5 లక్షల వ్యయంతో ఓపెన్‌ఎయిర్ థియేటర్ భవనాన్ని నిర్మించారు. రెండెకరాల స్థలంలో, మునిసిపల్ కార్యాలయం పక్కనే భవన నిర్మాణం జరిగింది. అయితే థియేటర్‌లో ఎలాంటి మౌలిక సదుపాయాలు లేకపోవడంతో వివాహాలు, ఇతర ప్రైవేట్ కార్యక్రమాల నిర్వహణకు ఏ ఒక్కరూ ముందుకు రావడం లేదు. థియేటర్ ద్వారా మునిసిపాలిటీకి సంవత్సరానికి కేవలం రూ.3 వేలు మాత్రమే ఆదాయం వస్తుందంటే పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థం అవుతుంది. థియేటర్‌కు నెలనెలా చెల్లించే కరెంటుబిల్లు, వాచ్‌మెన్ జీతం..ఇలా ఏడాది పొడవునా థియేటర్ నిర్వహణకు వచ్చే ఆదాయం కంటే ఖర్చే ఎక్కువే అవుతుంది. పాత భవనాన్ని పూర్తిగా పడగొట్టి అధునాతనంగా ఆడిటోరియం భవనం నిర్మిస్తున్నారు.

మధ్య తరగతి వారికి అందుబాటులో కల్యాణమండపం

పట్టణంలో కల్యాణ మండపాల కొరత తీవ్రంగా ఉంది. దీంతో ఓపెన్‌ఎయిర్ థియేటర్‌ను అభివృద్ధి చేయడంతో పాటు, అందుబాటులోవున్న విలువైన ఖాళీ స్థలంలో ఓపెన్ ఆడిటోరియం నిర్మించాలని ముదునూరి భావించి ముందడుగు వేశారు. ఓపెన్ ఆడిటోరియం అందుబాటులోకి వస్తే మునిసిపాలిటీకి సంవత్సరానికి లక్షల్లో ఆదాయం వస్తుంది. మధ్య తరగతి వారికి తక్కువ ఖర్చుతో పంక్షన్స్ చేసుకునే వెసులుబాటు కలుగుతుంది.

కార్పొరేట్ తరహాలో నిర్మాణం



నిరుపయోగంగా ఉన్న మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను రూ.3.50 కోట్లతో అధునాతనంగా ఓపెన్ ఆడిటోరియంగా నిర్మిస్తున్నాము. కొంత మేర మున్సిపల్ జనరల్ ఫండ్స్‌ను కూడా ఖర్చు చేస్తున్నాం. ఇక నుంచి అన్ని ప్రభుత్వ కార్యక్రమాలు కూడా ఇక్కడే చేసుకునేలా భవన నిర్మిస్తున్నాం. అనువైన మంచి సెంటర్‌లో, పార్కింగ్‌కు కూడా ఇబ్బంది లేకుండా కొత్త ఓపెన్ ఆడిటోరియం అందుబాటులోకి వస్తుంది.

– ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్‌విప్

యోగా మహోత్సవ్‌లో ప్రతిభ


ఢిల్లీ యోగా మహోత్సవ్‌లో జ్ఞాపికను అందుకుంటున్న నాగ నిహాల్

పెనుగొండ: పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్నట్లు నాలుగేళ్ల చిన్నోడు చేసిన యోగా ప్రదర్శన దేశవిదేశాల ప్రతినిధులు కరతాళ ధ్వనులను అందుకుంది. పెనుగొండకు చెందిన ఆసు బసవరాజు, మాధవిలన తనయుడు నాగనిహాల్ ఈ ఘనతను సాధించాడు. ఇంటర్నేషనల్ యోగా డే సందర్భంగా న్యూఢిల్లీలో మంగళవారం నిర్వహించిన యోగా మహోత్సవ్‌లో పెనుగొండకు చెందిన ఆసు నాగ నిహాల్ పాల్గొన్నాడు. దీనిలో శబ్ద భేరీ యోగాలో ప్రదర్శించిన ప్రదర్శన పలువురును విస్మయ పరిచింది. కళ్లకు గంతలు కట్టుకొని నిర్వాహకులు చూపిన అంకెలు, రంగులు, ఇతర వస్తువులను కరక్ట్‌గా చెప్పడంతో పాటు, గంతలతోనే సైకిల్ తొక్కడం వంటి ప్రదర్శనలతో ఆకట్టుకున్నాడు. అనంతరం నాగనిహాల్‌ను జ్ఞాపికతో సత్కరించారు. ఆన్‌లైన్ యోగా క్లాసుల్లో అంతర్జాతీయ యోగా గురువు పిడుగు హరిదాసు శ్రీనివాసు నుంచి శబ్దభేరి యోగా శిక్షణ పొందినట్లు తల్లిదండ్రులు ఆసు బసవరాజు, మాధవి తెలిపారు.

లేగదూడల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ


లేగదూడల ప్రదర్శనలో మొదటి బహుమతిని అందిస్తున్న సర్పంచ్ మరియు అధికారులు

మొగల్తూరు: ప్రస్తుతం ఉన్న పెయ్య దూడలే రేపటి పాడిపశువులుగా గుర్తించి రైతులు లేగదూడల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పశు సంవర్ధక శాఖ డీప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జవాన్ హుస్సేన్ సూచించారు. మంగళవారం స్థానిక వెటర్నరీ ఆసుపత్రి ప్రాంగణంలో లేగదూడల ప్రదర్శన, దూడల పెంపకంపై ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. పెయ్య దూడలను శాస్త్రీయ పద్ధతిలో పోషిస్తే వాటిని మంచి పాడి పశువులుగా అభివృద్ధి చేసుకోవచ్చున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన లేగదూడల ప్రదర్శనలో మండలంలోని పలుగ్రా మాలకు చెందిన 24 లేగదూడలను ప్రదర్శనలో ఉంచారు. మొదటి బహుమతిగా దారితిప్పకు చెందిన రైతు సరిపల్లి సుబ్బరాజు పోషిస్తున్న సాహివాల్ జాతికి చెందిన లేగదూడకు దక్కగా, రెండో బహుమతి రామన్నపాలేనికి చెందిన రైతు అయితం చందు పోషిస్తున్న పుంగనూరు జాతికి చెందిన లేడదూడకు, మూడో బహుమతి మొగల్తూరుకు చెందిన రైతు రావూరి సత్యనారాయణ పోషిస్తున్న లేగ దూడకు దక్కింది. ఈ కార్యక్రమంలో ఎంపీసీ చైర్మన్ పెండ్ర వీరన్న, సర్పంచ్ పడవల మేరీ, పశుసంవర్ధక శాక ఏడీ డాక్టర్ సుధాకర్, ఈవో డాక్టర్ జేసురత్నం, వెటర్నరీ డాక్టర్లు నీలిమ, సురేంద్ర, వైఎస్సార్ సీపీ నాయకులు పడవల సత్యనారాయణ, పెంకే చంటి పాల్గొన్నారు.

లా నేస్తం అర్హత వయస్సు పెంచాలని వినతి


రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్‌కి వినతిపత్రం అందిస్తున్న లాయర్లు

పాలకొల్లు అర్బన్: డాక్టర్ వైఎస్సార్ లా నేస్తం ద్వారా ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన జూనియర్ లాయర్లు లబ్ధి పొందేందుకు ప్రస్తుతం ఉన్న 35ఏళ్ల వయో పరిమితిని 40 ఏళ్లకు పెంచే విధంగా ప్రభుత్వానికి సిఫార్సు చేస్తానని రాష్ట ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ హామీ ఇచ్చారు. పాలకొల్లు కోర్టు ఆవరణలో మంగళవారం పలువురు జూనియర్ లాయర్లు లా నేస్తం ద్వారా ఏడాదికి రూ.5 వేలు చొప్పున మూడు సంవత్సరాలకు రూ.15 వేలు జూనియర్ లాయర్లు లబ్ధి పొందుతున్నారన్నారు. అయితే ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన జూనియర్ లాయర్లకు వయో పరిమితి పెంచాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆనందప్రకాష్ జూనియర్ల లాయర్ల ఉద్దేశించి మాట్లాడుతూ ఈ విషయాన్ని కమిషన్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే లాయర్ల సంక్షేమం కోసం బార్ అసోషియేషన్‌కు రూ.100 కోట్లు నిధులు విడుదల చేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది కుంచిలపల్లి వినిస్టన్‌బాబు, బండి సుందరరామమూర్తి, వడ్లపాటి ఆనందరాజు, పారుపల్లి సుందర్‌పాల్, పాముల చిట్టిబాబు, వేదాల నాగరాజు, రావి దేవరాజు, ఆర్ ప్రభాకరరావు, కత్తుల సత్యనారాయణ, గంజి రాజు తదితరులు పాల్గొన్నారు.

పోరాట ప్రదర్శనను జయప్రదం చేయాలి

పెనుగొండ: ఢిల్లీలో జరగనున్న కార్మిక, కర్షక పోరాట ప్రదర్శనను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ జిల్లా కార్యదర్శి ఆకుల హరేరాం పిలుపు ఇచ్చారు. మంగళవారం ఏప్రిల్ 5న జరగనున్న చలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం,కౌలు రౌతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియూ సంఘాల ఆధ్వర్యంలో ఆచంటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో సీఐటీయూ మండల అధ్యక్షురాలు వైట్ల ఉషారాణి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వద్దిపర్తి అంజిబాబు దాసిరెడ్డి కోటేశ్వరరావు, ఎస్‌వీఎస్ శర్మ, నిమ్మన వెంకట తాయారు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయ ప్రతిష్ఠ పూజలు


వాలమర్రులో పూజలు చేస్తున్న భక్తులు

పాలకొల్లు అర్బన్: మండలంలోని వాలమర్రులో పెన్మెత్స సత్య సీతారామరాజు (మునసబు) జ్ఞాపకార్థం సుమారు రూ.2 కోట్లతో నిర్మించిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠలో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రతిష్ఠలో భాగంగా గ్రామోత్సవం నిర్వహించారు. బ్రహ్మశ్రీ ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యుల బ్రహ్మత్వంలో గ్రామానికి చెందిన 12 మంది దంపతులతో ప్రత్యేకంగా నిర్మించిన యాగశాలలో పూజలు నిర్వహించారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలి


కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పాలకొల్లు సెంట్రల్: ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ పసుపులేటి చినబాబు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక బెత్లహంపేటలో ఎమ్మార్పీఎస్ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా చినబాబు మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపేందుకు ఒత్తిడి చేయనున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా ఈ నెల 27న మాదిగ ఉద్యోగస్తులతో 28న మహాజన సోషలిస్ట్ పార్టీల నాయకత్వంలో చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. అలాగే ఏప్రిల్ 3న మంద కృష్ణ నాయకత్వంలో వేలాది మంది మాదిగలతో విజయవాడ, హైదరాబాద్ నగరాల్లో బీజేపీ కార్యాలయాలను ముట్టడించడం, 4న విజయవాడ, హైదరాబాద్ నగరాలను దిగ్బంధం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు ఇంచార్జ్ కొండేటి వరదరాజు, పెట్టిల రజాక్, నామాల అన్నమయ్య, సనమండ శాస్త్రి, యార్లగడ్డ బండ, పసుపులేటి సుమంత్, కొండేటి అఖిల్, ఖండవల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త రిక్షాను అడ్డుకున్న వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు


పెదమామిడిపల్లిలో చెత్త రిక్షాను పంచాయతీ గుమస్తా ఇంటిముందు పెట్టి తాళం వేసిన దృశ్యం

పాలకొల్లు అర్బన్: డంపింగ్ యార్డులో చెత్తను దిగుమతి చేయడాన్ని అడ్డుకున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పెదమామిడిపల్లి పంచాయతీ కార్యదర్శి సీహెచ్ హిమబిందు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో వివరాలిలా ఉన్నాయి. మంగళవారం ఉదయం 11.30–12గంటల మధ్యలో పెదమామిడిపల్లికి చెందిన సిర్రా చిన్ని, బొమ్మిడి రత్నరాజు, యార్లగడ్డ అబ్రహాం అనే వ్యక్తులు చెత్త దిగుమతి చేస్తున్న పంచాయతీ సిబ్బందిని అడ్డుకుని దుర్భాషలాడారు. ఆ చెత్త రిక్షాను సిర్రా చిన్ని అనే వ్యక్తి స్వాధీనం చేసుకుని తన ఇంటికి తీసుకువెళ్లారు. పంచాయతీ కార్యదర్శి హిమబిందు, పంచాయతీ సిబ్బంది సిర్రా చిన్ని ఇంటికి వెళ్లి అడుగగా చిన్ని దుర్భాషలాడుతూ తన జోలికి వస్తే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతానని బెదిరించారు. ఆ చెత్త రిక్షాను పంచాయతీ గుమస్తా శీలం దేవరాయులు ఇంటి గేటు ముందు పెట్టి తాళం వేసి ఆ తాళం తీసుకుని వెళ్లిపోయారు దీంతో సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి సీహెచ్ హిమబిందు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గోవు, వృషభ కల్యాణం


మేడపాడులో గోవు, వృషభానికి పెళ్లి చేస్తున్న గ్రామస్తులు

యలమంచిలి: గోవు, వృషభ కల్యాణం ..చూసిన వారికి వైభోగమనేలా మంగళవారం మేడపాడు గ్రామంలో గోవృషభ కల్యాణం నిర్వహించారు. మేడపాడు గ్రామానికి చెందిన నారిన ప్రసాద్ వృషభాన్ని అల్లారుముద్దుగా పెంచుకున్నారు. దానికి యుక్త వయస్సు రావడంతో గోవును తీసుకువచ్చి కల్యాణం చేశారు. పెనుగొండకు చెందిన వైకానస ఆగమ పండితులు గోవర్థనం సాయి రాఘవేంద్రాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు యేడిద వికనసాచార్యులు, గోవర్ధనం మాధవాచార్యులు, పెరవలి పవన్‌కుమారచార్యులు ఈ కల్యాణం చేశారు. ఈ సందర్భంగా గోవర్ధనం సాయి రాఘవేంద్రాచార్యులు మాట్లాడుతూ లోక కల్యాణర్థం వెంకటేశ్వర స్వరూపంగా వృషభాన్ని లక్ష్మీ స్వరూపంగా గోవును భావించి గోవృషభ కల్యాణం చేస్తారన్నారు. కల్యాణానంతరం వృషభానికి శంకు, చక్రాలను అచ్చువేసి విడిచిపెట్టారు.

పరిశుభ్రత పాటిస్తే అనారోగ్యం దూరం

సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ


విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందిస్తున్న సబ్ కలెక్టర్ సూర్యతేజ


దిగమర్రు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న సర్పంచ్ రాపాక నగేష్ కరుణాకర్


చిట్టవరంలో విద్యార్థులకు నులిపురుగు నివారణా మందును పంపిణీ చేస్తున్న వైద్యులు


పోడూరులో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: అనారోగ్యానికి దూరంగా ఉండాలంటే తప్పనిసరిగా వ్యక్తిగత శుభ్రత పాటించాలని సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ అన్నారు. మంగళవారం స్థానిక బీఆర్‌ఎంవీ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో నులి పురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ సూర్యతేజ మాట్లాడుతూ ఏదైనా ఆహారం తీసుకునేటప్పుడు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. అలాగే వచ్చేది వేసవి కాలం కాబట్టి ప్రతీ విద్యార్థి పరిశుభ్రతతో పాటు మంచినీళ్లు ఎక్కువగా తాగాలని సూచించారు. అనంతరం నులిపురుగులు నిర్మూలన కోసం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె.పి నాగదేవి, ఎంఈవో ప్రసాద్, డాక్టర్ జాన్‌లియో, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక జీవీఎస్‌వీఆర్‌ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జాన్ లియో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. హెచ్‌ఎం రాయపూడి భవానీప్రసాద్, మలేరియా ఆఫీసర్ రాజ్‌కుమార్, హెచ్‌వి అన్నమణి పాల్గొన్నారు. స్థానిక ఏఎస్ఎన్‌ఎం డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి ఆధ్వర్యంలో నులి పురుగుల నిర్మూలన దినోత్సవం (నేషనల్ డి వార్మింగ్ డే) నిర్వహించారు. డాక్టర్ ఎం.రామకృష్ణ, అధ్యాపకులు వై విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో మంగళవారం నులి పురుగుల నివారణకు వినియోగంచే డివార్మింగ్ మాత్రలు పంపిణీ చేశారు. 19 సంవత్సరాల వయస్సు లోపు ఉన్న విద్యార్థులు మధ్యాహ్నం భోజనానంతరం ఈ మాత్రలు వేసుకోవాలని ఎంపీడీఓ ఆర్‌సీ ఆనంద్‌కుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ నవీన్ కిరణ్, ఏఎన్‌ఎం శాంత కుమారి పాల్గొన్నారు.

దిగమర్రులో..

పాలకొల్లు అర్బన్: నులిపురుగులను నిర్మూలిస్తే పిల్లలు ఆరోగ్యవంతులుగా ఎదుగుతారని లంకలకోడేరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డా. అడ్డాల ప్రతాప్‌కుమార్ అన్నారు. జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఎంపీపీ స్కూల్‌లో విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలు మింగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 48 ప్రభుత్వ పాఠశాలలు, 7 ప్రయివేట్ పాఠశాలలు, 54 అంగన్‌వాడీ కేంద్రాలు, 2 ప్రయివేట్ కళాశాలల్లో 8500 మంది విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేశారు. దిగమర్రు జెడ్పీ హైస్కూల్‌లో గ్రామ సర్పంచ్ రాపాక నగేష్ కరుణాకర్ విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలు మింగించి వాటి ఆవశ్యకతను తెలియజేశారు. అలాగే ఆగర్తిపాలెం ప్రాథమిక పాఠశాలలో మెడికల్ ఆఫీసర్ డా.ఎం నవ్యజీవన్ విద్యార్థులతో ఆల్బెండాజోల్ మాత్రలు మింగించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి కె.ప్రభాకరరావు పాల్గొన్నారు.

నరసాపురంలో...

నరసాపురం రూరల్: జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని చిట్టవరం గ్రామంలోని ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిట్టవరం సీహెచ్‌వో, ఎంఎల్‌హెచ్‌పీ జె.నవ్యశ్రీ మాట్లాడుతూ పిల్లల ఎదుగుదల, శారీరక రుగ్మతలు తలెత్తేందుకు వారి కడుపులో ఉన్న నులిపురుగులు కారణమని వాటిని నివారించేందుకు ప్రతీఏటా ప్రభుత్వం ఆధ్వర్యంలో డీ వార్మింగ్‌డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చిట్టవరం, గొంది, కొత్తనవరసపురం, పాతనవరసపురం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం జీఎస్ చంద్రకుమారి, హెల్త్ అసిస్టెంట్ సవరపు వెంకటేశ్వరరావు, ఆశావర్కర్‌లు కమల కుమారి, గంగ పాల్గొన్నారు.

పోడూరులో..

పోడూరు: స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో 7619 మంది పిల్లలకు నులిపురుగుల నివారణ (ఆల్బెండజోల్) మాత్రలు పంపిణీ చేయాల్సి ఉండగా 5798 మంది పిల్లలకు మంగళవారం మాత్రలు మింగించినట్లు స్థానిక మెడికల్ ఆఫీసర్ శ్రీవాసవి తెలిపారు. ఏడాది నుంచి 2 ఏళ్ల వయస్సున్న పిల్లలకు సగం మాత్ర (200 మి.గ్రా), 2 ఏళ్ల నుంచి 19 ఏళ్ల వయస్సున్నవారికి పూర్తి మాత్ర (400 మి.గ్రా) మిగించినట్లు తెలిపారు. మొత్తం 52 అంగన్‌వాడీ కేంద్రాలు, 51 ప్రభుత్వ పాఠశాలలు, 8 ప్రైవేటు పాఠశాలలతో పాటు స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో పారా మెడికల్ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలతో మాత్రలను పంపిణీ చేశారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు మిగతా పిల్లలకు మాత్రలు అందజేస్తామని మెడికల్ ఆఫీసర్ శ్రీ వాసవి తెలిపారు.

ఆస్కార్ అవార్డు రావడం అభినందనీయం

పాలకొల్లు సెంట్రల్: తెలుగు చలనచిత్రానికి మొట్టమొదటి సారిగా ఆస్కార్ అవార్డు రావడం చాలా అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే బంగారు ఉషారాణి మంగళవారం విలేకరులకు తెలిపారు. పాలకొల్లులో గతంలో జరిగిన ఓ స్కూల్ ఫంక్షన్‌లో ఆస్కార్ అవార్డు గ్రహీత పాటల రచయిత చంద్రబోస్‌తో కలిసిన సందర్భాన్ని ఆమె గుర్తు చేసుకున్నారు. ఆర్ఆర్ఆర్ సినిమాలో నాటు నాటు పాటకు ఆస్కార్ రావడం అటువంటి వ్యక్తులు పాల్గొన్న కార్యక్రమంలో తాను పాల్గొనడం చాలా అదృష్టంగా భావిస్తున్నానన్నారు. మన తెలుగు చలనచిత్రానికి ఆస్కార్ ద్వారా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం శుభపరిణామమని తెలిపారు.